క్లుప్తంగా

లబ్ధిదారుకు కారు అందజేత

డెంకాడ: వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం ఆవరణంలో పీఎంఈజీపీ పథకంలో భాగంగా మంజూరైన కారును లబ్ధిదారుడు డోల రామారావుకు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం గురువారం అందజేశారు. అలాగే ఇదే పథకంలో భాగంగా గంజి పద్మావతికి మంజూరైన జిరాక్స్ మిషన్‌ను కూడా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరి, ఏపీఎం విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాండ్రంకి ఆదినారాయణ, సురేష్, సంచాన కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు, పేకాట నిషేధం


సురేష్, ఎస్సై

పూసపాటిరేగ: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎ. నరేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు, నగదు ఉన్నప్పుడు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవ్వరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు.

సంగీత కళాశాలలో త్యాగరాజ ఆరాధనోత్సవం


కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

విజయనగరం టౌన్: నగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు త్యాగరాజ కీర్తనాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు మండపాక రవి, డాక్టర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మారుతీ స్వయం సహాయక సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కణపాక అగురవీధిలో సంఘం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదవర్గాల వారిని ఆదుకోవడంలో సంతృప్తి ఉందన్నారు. సంపాదించిన దాంట్లో కొంతమొత్తాన్ని పేదల కోసం వెచ్చించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తులసీరామ్, నాగరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ప్రజలను కోరారు. ఇళ్లు విడిచి బయట ప్రాంతాలకు వెళ్లేవారు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే, ఆయా ప్రాంతాల్లో నిఘా పెంచుతామని చెప్పారు. విలువైన వస్తువులేవీ ఇంట్లో ఉంచవద్దని.. ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో గురువారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్సై వి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ కార్యదర్శి పర్యటన


జరజాపుపేట ఉన్నత పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కరుణాకర్

నెల్లిమర్ల: నగర పంచాయతీలో హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శి జి. కరుణాకర్ గురువారం పర్యటించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జరజాపుపేటలోని మొండివీధి ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న నాడు – నేడు పనులను పరిశీలించారు. అనంతరం వార్డు సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ రమణరాజు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, ఏఈ శ్రీరాములనాయుడు, తదితరులున్నారు.

యువత సన్మార్గంలో నడవాలి...

- ప్రముఖ వైద్య నిపుణుడు తిరుమల ప్రసాద్
- వాడవాడలా వివేకానందుని జయంతి వేడుకలు


మహిళా కానిస్టేబుల్‌కు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం క్రైమ్: స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత సన్మార్గంలో నడవాలని ప్రముఖ వైద్య నిపుణుడు తిరుమల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జిల్లా పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు నేతృత్వంలో రెండు కిలోమీటర్ల వాకింగ్, రన్నింగ్ కార్యక్రమాన్ని గురువారం స్థానిక విజ్జీ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివేకానందుడి మార్గంలో నడిచి ఉత్తమ పౌరులుగా తయారు కావాలన్నారు. డాక్టర్ జీసీ నాయుడు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ బలాలు, బలహీనతలు తెలుసుకుని ఉత్తమ నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం వాక్, రన్‌లో ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లు లక్ష్మి, రజినిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అచ్యుతరామయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వివేకానందుని ఆలోచనలు ఉన్నతమైనవి..

వివేకానందుని ఆలోచనలు ఎంతో ఉన్నతంగా ఉంటాయని, చాలా చిన్న వయసులోనే ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేశారని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువతను పెడమార్గం పెట్టించే అంశాలు అనేకం ఉన్నాయని, అటువైపు దృష్టి సారించకుండా, తమ అభివృద్ధికి అవసరమయ్యే అంశాలపై దృష్టి సారించాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఎన్‌సీసీ అధికారి ఎం.సత్యవేణి, బి.సూరపునాయుడు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


సత్య కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు


విజయనగరం ఫోర్ట్: రక్తదాతను సన్మానిస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

జిల్లా బ్రాహ్మణ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో...

జిల్లా బ్రాహ్మణ సంఘం ఏపీబీఎస్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సరిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డాక్టర్ వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, కిశోర్, భవానీ, సీతయ్య, అప్పారావు, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.


వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

ఆదర్శంగా తీసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని స్వామి వివేకానంద ఆదర్శ నిర్మాణ సంస్థ చైర్మన్ డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక సాయి ఆస్పత్రి ఆవరణంలో రక్తదాన శిబిరం నిర్వహించి, రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఐ.గోపాలరావు, అచ్చిరెడ్డి, అక్కెన లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


లబ్ధిదారుకు గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో పలువురు లబ్ధిదారులకు పీఎం ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్యాస్ కనెక్షన్లను వినియోగదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని, గడిచిన మూడున్నరేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. కులమతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.

కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తహసీల్దార్ కేవీ రమణరాజు, కౌన్సిలర్లు పాండ్రంకి సత్యవతి, తుమ్మ భారతి, నల్లి కృష్ణవేణి, మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ


సూరికి ట్రైసైకిల్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన బోను సూరికి విభిన్న ప్రతిభావంతుల శాఖ వారి సౌజన్యంతో మంజూరైన ట్రై సైకిల్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం గంటస్తంభం: స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు విజయనగరం చింతలవలస క్రికెట్ స్టేడియంలో జరగబోయే జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యాలయంలో చీపురుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు.. అనూహ్య స్పందన

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నాలుగో డివిజన్ పరిధి మంగళవీధిలో గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ప్రజాస్పందన బాగుందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలు అందుతున్నాయని సంతోషంగా చెబుతుండడం విశేషమని చెప్పారు. అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వజ్రపు శ్రీను మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన నవరత్నాల హామీలను శతశాతం అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. వృద్ధులకు ఒకటో తేదీ నాటికే పింఛన్లు నేరుగా అందడం, ఆసరా, అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన ఇలా అనేక రకాల పథకాలు వివిధ వర్గాల ప్రజలకు అందించడం గొప్ప విషయమని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాన్సాస్ విద్యాసంస్థలను ప్రభుత్వమే నిర్వహించాలి


డీఆర్‌ఓ గణపతిరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: మూతపడుతున్న మాన్సాస్ విద్యాసంస్థలను ప్రభుత్వమే నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో డీఆర్‌ఓ గణపతిరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు చోడి ఆదినారాయణ, రామేశ్వరపు రామారావు, ఎస్ఎస్ రెడ్డి, పి. లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.సత్యం అన్నారు. గురువారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రాము, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఫ్యాప్టో నూతన చైర్మన్ బి. మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, కార్యవర్గ సభ్యులు డీఈఓ బి. లింగేశ్వరరెడ్డిని గురువారం అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.
– విజయనగరం ఫూల్‌బాగ్

దివ్యాంగుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు


స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: పట్టణంలోని రెవెన్యూ కల్యాణ మంటపంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘ ప్రతినిధులు కోలగట్లను ఘనంగా సత్కరించి వివేకానందుని విగ్రహ ప్రతిమను బహూకరించారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ, మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు సంక్రాంతి సంబరాలు దోహదపడతాయన్నారు.

ఎమ్మెల్యే బడ్డుకొండకు సన్మానం


ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును సన్మానిస్తున్న ఏపీ ఎన్జీఓ సంఘ సభ్యులు

భోగాపురం: నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీఓ సంఘ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును మోపాడలో అతని నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ భోగాపురం తాలుకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు ఎన్జీఓ భవనానికి స్థలంతో పాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు జగదీష్, గణపతి, సత్యనారాయణ, కృష్ణవేణి, సుధాకర్, లక్ష్మణరావు, రమణమూర్తి, ఉదయ్‌కుమార్, సూరి అప్పారావు, అక్రమ్, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

నెరవేరిన ఏళ్ల నాటి కల..


మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- బుచ్చన్నకోనేరు ప్రాంతలో కుళాయిలు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని బుచ్చన్న కోనేరు ప్రాంత వాసుల ఏళ్లనాటి కల ఎట్టకేలకు నెరవేరింది. బుచ్చన్న కోనేరు ఎగువ గట్టు ప్రాంత వాసుల కోసం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కంటుబుక్త తవిటిరాజు మాట్లాడుతూ, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎగువ ప్రాంతం వారు ఎన్నో ఏళ్లుగా తాగునీటి ఇక్కట్లు పడ్డారని, ఎట్టకేలకు కోలగట్ల కృషి సమస్య పరిష్కారమైందన్నారు. అలాగే దుర్గంధభరితంగా ఉన్న బుచ్చన్నకోనేరు అభివృద్ధికి కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల రూ. 80 లక్షలు కేటాయించారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ కనకల నాగవల్లి, పార్టీ నాయకులు కాళ్ల సూరిబాబు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ మహాసభలకు తరలిరండి


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఆర్ఎస్.జాన్, తదితరులు

విజయనగరం టౌన్: కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చెస్ ఆఫ్ నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) నిర్వహిస్తున్న మహాసభలకు క్రైస్తవ సోదరులందరూ తరలిరావాలని సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మహాసభలు నిర్వహిస్తామన్నారు. సోంపేట నుంచి అవనిగడ్డ వరకూ ఉన్న బాప్టిస్ట్ రాయబారులందరూ మహాసభల్లో పాల్గొని, దైవకృపను పొందాలని ఆకాంక్షించారు. రాజమండ్రి క్రైస్ట్ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ టి. ఆర్థర్ ప్రసాద్ దైవసందేశాన్ని అందిస్తారన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

పుకార్లను నమ్మొద్దు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వస్తున్న పుకార్లను నమ్మొద్దని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వీపీ స్వామినాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. పోస్టుల భర్తీకి సంబంధించి రాష్ట్ర అధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. జిల్లాలోని నిరుద్యోగులందరూ ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్–1967తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూనికలు కొలతల్లో తేడాలపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

సచివాలయాల ద్వారా సమస్యలు పరిష్కారం


సచివాలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన

చీపురుపల్లిరూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కరకాం గ్రామసచివాలయంలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. సచివాలయం పరిధిలో పథకాల లబ్ధిదారుల వివరాలు, స్పంద నలో అందిన అర్జీల్లో ఎన్నింటిని పరిష్కరించారో సిబ్బందిని ఆరా తీశారు. స్థానిక నాయకులు, గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అర్హత ఉన్నా పింఛన్, పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని స్థానికులు తెలిపారు. గ్రామంలో నివాసాల మీదుగా విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని పక్కకు మార్పించాలని, అలాగే శిథిలావస్థకు చెందిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని వేయించాలని గ్రామస్తులు ఎంపీని కోరారు. ఆర్ఈసీఎస్ ఏడీకు ఎంపీ ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్క రించాలని సూచించగా... ఏడీ స్పందిస్తూ ఎస్టిమేషన్ వేసి పనులు చేపడతామని బదులిచ్చారు. రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను, రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేశామని, ప్రజారోగ్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌లను నిర్మిస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీ వెంట రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము సునీల్, గంగుపల్లి తాడు, మీసాల చంద్రరావు, వై.అప్పలనాయుడు, ఏ.అప్పారావు పాల్గొన్నారు.